సాక్షి గుంటూరు

ఆదివారం । 26 । నవంబర్ । 2023



పాఠశాల వాహనాలపై కేసు

పట్నంబజారు: జిల్లా రవాణా శాఖ అధికారులు శనివారం గుంటూరు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. 12 ఆటోలు, రెండు స్కూలు బస్సులపై కేసు నమోదు చేశారు.



ఘనంగా శోభాయాత్ర

అమరావతి: అయోధ్య నుంచి శ్రీరాముని పూజించిన అక్షింతల కలశానికి శనివారం అమరావతిలో ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు. శ్రీరామ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన భక్తులు శనివారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు.

న్యూస్‌రీల్


ప్రొవిజనల్ మెరిట్ జాబితా విడుదల

గుంటూరుమెడికల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం పరిధిలో నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రాం ద్వారా, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాంట్రాక్ట్ మెడికల్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఈనెల 10న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ జాబితా శనివారం విడుదల చేశామన్నారు. అభ్యంతరాలు ఉంటే ఈనెల 30వ తేదీలోపు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా అందజేయాలని వెల్లడించారు. ప్రొవిజనల్ మెరిట్ లిస్టును గుంటూరు.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు.

డిసెంబర్ 13లోగా దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట: జిల్లా మహిళా, శిశు సంక్షేమం, సాధికారిత కార్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులకు డిసెంబరు 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆ శాఖ పీడీ బి.అరుణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాలల సంరక్షణ యూనిట్ (డీపీయు)లో 12 పోస్టులు, శిశు సంరక్షణ కేంద్రంలో 11 పోస్టులు (కేవలం మహిళలకే), పిడుగురాళ్లలోని చిల్డ్రన్స్ హోమ్‌లోని ఎనిమిది పోస్టులు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైమ్ పద్ధతి ప్రకారం భర్తీచేయబడతాయన్నారు. అభ్యర్థులు ఈ ఏడాది జూలై నాటికి 18 ఏళ్ల నుంచి 42 ఏళ్లలోపు వారై ఉండాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు నరసరావుపేటలోని కార్యాలయానికి తమ దరఖాస్తులను సమర్పించాలని కోరారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 524.30 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎడమకాలువకు 4,034, ఎస్‌ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటి మట్టం 839.30 అడుగుల వద్ద ఉంది.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ఠ ధర రూ.2000, గరిష్ఠ ధర రూ.3100, మోడల్ ధర రూ.2500 వరకు పలికింది.

శరవేగంగా గుంటూరు చానల్ విస్తరణ పనులు

- ఇప్పటికే ఐదు గ్రామాలకు డ్రాఫ్ట్ నోటిఫికేషన్..
- రెండు మూడు రోజుల్లో మరో రెండు గ్రామాలకు నోటిఫికేషన్
- నాలుగు గ్రామాల్లో అలైన్‌మెంట్ మార్పు
- త్వరలోనే భూసేకరణకు నోటిఫికేషన్



గుంటూరు చానల్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు చానల్ విస్తరణ పనులకు శరవేగంగా రంగం సిద్ధం అవుతోంది. గుంటూరు జిల్లాలో పెదనందిపాడు, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు మండలాల్లోని 11 గ్రామాల్లో 381.237 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉండగా ఇప్పటికే అన్ని గ్రామాలకు ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేశారు. అభ్యంతరాల స్వీకరణ తర్వాత రావిపాడు, గొరిజవోలుగుంటపాలెం, కొండేపాడు, యనమదల, గారపాడు గ్రామాలకు డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. మల్లయ్యపాలెం, ప్రత్తిపాడు గ్రామాలకు రెండు మూడు రోజుల్లో డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. అనపర్రు, రాజుపాలెం, వరగాని, పాలపర్రు గామస్తుల నుంచి అభ్యంతరాలు వచ్చాయి. ఆ గ్రామాల ప్రజలు ఈ చానల్ ఊరుకు పశ్చిమంగా వెళ్తుందని నీరు ఎక్కువ వస్తే తమ ఊళ్లు మునుగుతాయంటూ అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ చానల్‌ను ఊరికి తూర్పువైపు నుంచి తీసుకువెళ్లాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఇంజినీర్ ఇన్ చీఫ్‌తో కమిటీ ఏర్పాటు చేసి విచారణ జరిపించారు. ఈ కమిటీ ప్రస్తుత అలైన్‌మెంట్ వల్ల ఇబ్బంది రాదని తేల్చింది. అయినప్పటికీ గ్రామస్తుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని అలైన్‌మెంట్‌లో మార్పులు చేశారు. గ్రామస్తులు కోరిన విధంగా మార్పులు చేశారు. దీనికి సంబంధించి భూసేకరణకు సర్వే పూర్తి కావొచ్చింది. త్వరలో నోటిఫికేషన్ విడుదల చేసేందుకు రంగం సిద్ధం చేశారు.

75 వేల ఎకరాలకు సాగు నీరు

గుంటూరు చానల్‌ను 1962లో 47 కిలోమీటర్ల మేర నిర్మించారు. తర్వాత కాలంలో పెరిగిన నీటి అవసరాల దృష్ట్యా చానల్ సామర్థ్యం పెంచాలని, దీన్ని బాపట్ల జిల్లా పర్చూరు వరకూ పొడిగించాలన్న డిమాండ్ ముందుకు వచ్చింది. గత ప్రభుత్వంలో ఎన్నికల సమయంలో టెండర్లు పిలుస్తున్నట్లు హడావిడి చేసి తర్వాత ఎన్నికల కోడ్ పేరుతో దీన్ని పక్కన పెట్టారు. గతేడాది ప్రత్తిపాడు వచ్చిన సమయంలో స్థానిక ఎమ్మెల్యే మేకతోటి సుచరిత గుంటూరు చానల్ విస్తరణ అంశాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన దీన్ని పూర్తిచేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం దీని విస్తరణ కోసం అడుగులు ముందుకు పడ్డాయి. ఈ చానల్ విస్తరణ వల్ల 48 వేల ఎకరాల ఆయకట్టు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలలో రావడమే కాకుండా మల్లయపాలెం, కాకుమాను మేజర్ల కింద ఉన్న 9,600 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు ఉపయోగపడుతుంది. గుంటూరు చానల్ 47వ కిలోమీటర్ నుంచి 74.065 కిలోమీటర్ వరకూ విస్తరించాలని నిర్ణయించారు. వట్టిచెరుకూరు మండలం గారపాడు గ్రామం నుంచి పర్చూరు మండలంలోని పర్చూరు వాగు వరకూ ఈ చానల్‌ను విస్తరించనున్నారు. ప్రస్తుతం 47 కిలోమీటర్ వరకూ ఉన్న గుంటూరు చానల్‌ను ఆధునీకరించడంతోపాటు కాలువ సామర్థ్యాన్ని పెంచాలని నిర్ణయించారు. దీని కోసం కాలువలో లైనింగ్ పనులు చేయనున్నారు. ఈ పనులు పూర్తయితే కాలువ సామర్థ్యం 600 నుంచి 750 క్యూసెక్కులకు పెరుగుతుంది. దీనివల్ల 75 వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉంటుంది. ఈ పనుల కోసం రూ.274.53 కోట్లతో పరిపాలనా అనుమతులు వచ్చాయి. ఈ పనులను మెగా ఇంజినీరింగ్ సంస్థకు అప్పగించారు. చానల్ విస్తరణ వల్ల ప్రత్తిపాడు నియోజకవర్గంలోని పెదనందిపాడులో 12,523 ఎకరాలు, ప్రత్తిపాడులో 3,232, కాకుమానులో 2,061, బాపట్ల జిల్లా పర్చూరు మండలంలో 20,526, పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట మండలంలో 58 ఎకరాలు మొత్తం 38,400 ఎకరాల కొత్త ఆయకట్టు వస్తుంది. ఈ ప్రతిపాదనలో నక్క వాగు, ఓగేరు వాగులను గుంటూరు చానల్ దాటాల్సి ఉంటుంది. దీని కోసం కెనాల్ సైఫాన్, అక్విడెక్ట్‌లను ప్రతిపాదించారు. వరదల సమయంలో అదనపు నీటిని ఈ వాగులో కలిపేందుకు వీలుగా 74.025 కిలోమీటర్ వద్ద సర్‌ప్లస్ ఎస్కేప్ రెగ్యులేటర్‌ను తొండివాగు వద్ద ప్రతిపాదించారు. దీని అలైన్‌మెంట్, హైడ్రాలిక్ పర్టిక్యులర్స్‌ను కృష్ణా డెల్టా సిస్టమ్స్ చీఫ్ ఇంజినీర్ ఆమోదించారు. భూసేకరణ కోసం రూ.113.39 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. గుంటూరు జిల్లాలో 389.78 ఎకరాలు, బాపట్ల జిల్లాలో 51.38 ఎకరాలు కలిపి మొత్తం 441.16 ఎకరాలు సేకరించాల్సి ఉంది. ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. సోషల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ సర్వేకి మినహాయింపు తీసుకువచ్చారు. అవార్డు జారీ చేసిన వెంటనే రైతులకు డబ్బులు చెల్లిస్తారు.

త్వరలో భూసేకరణ ప్రక్రియ పూర్తి



గుంటూరు చానల్ విస్తరణకు సంబంధించి ఇప్పటికే ఐదు గ్రామాలకు డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఇవ్వడం జరిగింది. మరో రెండు గ్రామాలకు త్వరలోనే ఇస్తాం. నాలుగు గ్రామాల్లో అలైన్‌మెంట్ మారడంతో సర్వే జరుగుతోంది. సర్వే పూర్తికాగానే నోటిఫికేషన్ జారీ చేస్తాం. అవార్డు పాస్ అవ్వగానే నిధులు వస్తాయి. త్వరలోనే విస్తరణ పనులు మొదలు పెడతాం.

– ఎం.వేణుగోపాలరెడ్డి, జిల్లా కలెక్టర్

నేడు అమరేశ్వరుని తెప్పోత్సవం

అమరావతి: పంచారామ క్షేత్రాలలో ప్రథమా రామ క్షేత్రమైన అమరావతిలో కార్తికపౌర్ణమి సందర్భంగా ఆదివారం అమరేశ్వరునికి వైభవంగా తెప్పోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ వేమూరి గోపినాథశర్మ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్తికపౌర్ణమి పర్వదినాన అమరేశ్వరాలయాన్ని సందర్శించే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా క్రమపద్ధతిలో క్యూలైన్లను ఏర్పాటుచేసి పోలీస్‌శాఖ సహకారంతో ట్రాఫిక్ నియంత్రణ, దేవాలయం, స్నానఘాట్‌లలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులకు ఉచిత ప్రసాదం, సుమారు 50వేల లడ్డూ ప్రసాదం తయారు చేస్తున్నామన్నారు. ఆదివారం రాత్రికి స్వామి వారి గ్రామోత్సవం, అనంతరం కృష్ణానదిలో వైభవంగా తెప్పోత్సవం, జ్వాలాతోరణం ఉత్సవం నిర్వహించటానికి వివిధ ప్రభుత్వశాఖలతో సమన్వయం చేసుకుని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో...

గ్రూప్–1, 2 ఉద్యోగ పరీక్షలపై

ఉచిత అవగాహన సదస్సు

- డిసెంబర్ 2వ తేదీన గుంటూరులో సదస్సు
- గెస్ట్ స్పీకర్‌గా సివిల్స్ విజేత బాలలత
- లక్ష్యం: గ్రామీణ, పట్టణ విద్యార్థులకు గ్రూప్–1,2 పరీక్షలపై అవగాహన కల్పించడం

సాక్షి ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రూప్–1,2 ఉద్యోగాల భర్తీకి త్వరలోనే ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో గ్రామీణ, పట్టణ విద్యార్థులను గ్రూప్–1,2 స్థాయి ఉద్యోగులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సాక్షిఎడ్యుకేషన్.కామ్ (www.sakshieducation.com) ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఉచిత అవగాహన సదస్సులను నిర్వహించనుంది. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షిఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం అందరికీ తెల్సిందే.

గెస్ట్ స్పీకర్‌గా బాలలత..

ఎంతో మందిని పోటీ పరీక్షల్లో విజేతలుగా తీర్చిదిద్దుతున్న సివిల్స్ టాపర్ బాలలత గారు గ్రూప్–1, గ్రూప్–2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సుకు గెస్ట్ స్పీకర్‌గా హాజరుకానున్నారు. ఆమె గ్రూప్ 1,2 పరీక్షలపై అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయనున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 8977625795 ఫోన్ నెంబర్‌కు పేరు, ఫోన్ నెంబర్, జిల్లా వివరాలను వాట్సాప్‌లో పంపగలరు.

అవగాహన సదస్సు తేదీ
డిసెంబర్ 2, 2023(శనివారం)

వేదిక	సమయం
ఆంధ్ర క్రిస్టియన్ కాలేజీ (ఏసీ కాలేజీ), గవర్నమెంట్ ఆసుపత్రి పక్కన, సాంబశివ పేట, మెయిన్ రోడ్ గుంటూరు	ఉదయం 9.30 నుంచి 12.30 వరకు

వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ : 8977625795

ప్రశ్నించే తత్వంతోనే ప్రగతి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి



గుంటూరుఎడ్యుకేషన్: ప్రశ్నించడం ద్వారానే సమాధానం దొరుకుతుందని, విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని జిల్లా ప్రధాననాయ్యమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి పేర్కొన్నారు. శనివారం పట్టాభిపురంలోని టీజీపీఎస్ కళాశాలలో చంద్రయాన్–3 విజయోత్సవంలో భాగంగా విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేందుకు ఇన్ఫినిటీ ఇన్‌స్పైర్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి మాట్లాడుతూ విద్యార్థులకు పరిశోధనా దృష్టి అవసరమని, ప్రశ్నించేతత్వం అలవర్చుకున్నప్పుడే ఎటువంటి సమస్యకైనా పరిష్కారం దొరుకుతుందని చెప్పారు. ఇస్రో శాస్త్రవేత్త ఆర్‌వీఎల్‌ఎన్ శ్రీధర్ మాట్లాడుతూ గతంలో ఇదే కళాశాలలో భౌతికశాస్త్ర అధ్యాపకునిగా విధులు నిర్వర్తించిన తాను తిరిగి శాస్త్రవేత్తగా రావడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు చదువుకునే వయసులోనే ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని, వాటి కోసం నిరంతరం శ్రమించాలని సూచించారు. లక్ష్యసాధన కోసం నిరంతర పరిశోధకుడిలా ఉండాలని చెప్పారు. ప్రపంచ దేశాలు మెచ్చేలా, భారత మాత గర్వపడేలా చంద్రయాన్–3 విజయవంతం కావడం ఆ ప్రాజెక్టులో పనిచేసినందుకు ఆత్మ సంతృప్తిని ఇచ్చిందని అన్నారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం అడుగుజాడల్లో మనమందరం నడవాలని పేర్కొన్నారు. మనకి తెలియని విషయాన్ని ఎంత కష్టమైనా తెలుసుకోవాలని, విద్యార్థులు ముఖ్యంగా తల్లిదండ్రుల కష్టాన్ని తెలుసుకుని చదువుకోవాలని చెప్పారు. నేను ఈ స్థితిలో ఉండటానికి ప్రధాన కారకులైన తల్లిదండ్రులు, గురువులకు ఎప్పటికీ రుణ పడి ఉంటానని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖన పోటీల విజేతలకు బహుమతు లు అందజేశారు. కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, కోశాధికారి వి.కృష్ణానంద్, వాసవీ విద్యానిధి కార్యదర్శి పి.నాగసుందరం, సంయుక్త కార్యదర్శి పి.నారాయణమూర్తి, తెల్లా కుల శ్రీనివాసబాబు, డిగ్రీ, పీజీ ప్రిన్సిపాల్స్ మనోహర్, డాక్టర్ ఎస్.అనితాదేవి, వైస్ ప్రిన్సిపాల్ భానుమురళీధర్, డాక్టర్ జీవీ సుధీర్‌కుమార్, డాక్టర్ కె.శాస్త్రి, రవికుమార్ పాల్గొన్నారు.

భిన్న లైంగిక ధోరణుల సమూహాలపై నిర్లక్ష్యం తగదు

- తగిన పాలసీలు, రిజర్వేషన్లతోనే వ్యవస్థలోకి దారి
- అన్ని పోరాటాల వాళ్లు అర్థం చేసుకుని మద్దతునివ్వాలి
- 'అర్థనారి'పై చర్చావేదికలో ట్రాన్స్, హిజ్రా రైట్స్ యాక్టివిస్ట్ రచన ముద్రబోయిన



మాట్లాడుతున్న రచన ముద్రబోయిన

తెనాలి: సమానత్వం ప్రకృతిలోనే లేనపుడు...కులం, మతం, క్లాస్...అన్నట్టుగా ఉన్న సమాజంలో దూరంగా నెట్టివేయబడుతున్న కొందరిని ద్వేషించటం తగదని ట్రాన్స్, హిజ్రా రైట్స్ యాక్టివిస్ట్ రచన ముద్రబోయిన అభిప్రాయపడ్డారు. పట్టణానికి చెందిన సాహితీ సాంస్కృతిక సంస్థ 'భిన్నస్వరాలు' ఆధ్వర్యంలో ఆహ్వానం లక్ష్మి సంస్మరణలో నెలనెలా నిర్వహిస్తున్న చర్చావేదికలో భాగంగా శనివారం సాయంత్రం బండి నారాయణస్వామి నవల 'అర్థనారి'పై చర్చావేదిక నిర్వహించారు. స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఏర్పాటైన కార్యక్రమానికి జీఎస్ నాగేశ్వరరావు సమన్వయకర్తగా వ్యవహరించారు. హైదరాబాద్‌కు చెందిన రచన ముద్రబోయిన మాట్లాడుతూ ఆడ, మగ జెండర్ రాజకీయాల చుట్టూ తిరిగే వ్యవస్థలో భిన్న లైంగిక ధోరణులు కలిగిన సమూహాలపై సమాజం ఎంత అమానుషంగా ప్రవర్తిస్తోంది అనే ఆలోచనే చేయటం లేదన్నారు. నిజానికది తమ దృష్టిలో క్రూరమైనదిగా చెప్పారు. తగిన పాలసీలు, రిజర్వేషన్లు లేనపుడు హిజ్రాలు, ట్రాన్స్‌జెండర్లు వ్యవస్థలోకి వచ్చేందుకు తగిన దారే లేదన్నారు.

తమలాంటి ట్రాన్స్‌జెండర్లకు తగిన రిజర్వేషన్లు కల్పించాలని, ఇందుకు తమ పోరాటాలే సరిపోవన్నారు. అన్ని పోరాటాల వాళ్లు అర్థం చేసుకుని తగిన మద్దతునివ్వాలని కోరారు. హిజ్రా లీడర్, టీటీపీఏ వ్యవస్థాపకులు కేఎస్‌వీ మోనాలిసా మాట్లాడుతూ హిజ్రా/ట్రాన్స్‌జెండర్లకు చదువు, వసతి, ఉపాధికి తగిన రిజర్వేషన్లు కావాలని చెప్పారు. వీరిపట్ల కుటుంబం, సమాజం చూసే దృక్పథం మారాల్సి ఉందన్నారు. గురు–చేలా వ్యవస్థ తమకో రక్షణ ఛత్రమని చెబుతూ ఒకరికొకరం సహకరించుకుంటామని తెలిపారు. వీరిలో చదువుకుని స్థిరపడుతున్న వారికి తగిన తోడ్పాటు కావాలన్నారు. హైకోర్టుకు వెళ్లి కొన్ని హక్కులను సాధించుకున్నామని చెబుతూ, తమకోసం తెలుగు రాష్ట్రాలు కొన్ని చట్టాలను తేవటం సంతోషంగా ఉందన్నారు. 'చినుకు' సంపాదకుడు రాజగోపాల్ తన ప్రసంగంలో, రొటీన్‌గా మారిపోయిన జీవితాల్లో మనది కాదనుకుంటున్న ప్రపంచాన్నీ, మన వ్యవస్థ అంగీకరించని మనుషులు గురించి నారాయణస్వామి 'అర్థనారి' నవలలో గొప్పగా రాశారని చెప్పారు. పుస్తకం చదివాక నిత్యం మనకు కనిపించే ట్రాన్స్‌జెండర్లను చూసే మన దృక్పథం మారుతుందని చెప్పారు. కవి జుగాష్‌విలి పర్యవేక్షించారు.

17 మంది 'సంగం' ఉద్యోగులు, సిబ్బందిపై కేసు

పోలీసులపై దౌర్జన్యం చేసిన ఘటన

చేబ్రోలు: మండల పరిధిలోని వడ్లమూడి సంగం డెయిరీ వద్ద పోలీసులపై దౌర్జన్యం చేసి, విధులకు ఆటంకం కలిగించిన 17 మంది ఉద్యోగులు, సిబ్బందిపై చేబ్రోలు పోలీసుస్టేషన్లో కేసు నమోదైంది. ఏలూరు జిల్లా పాడి రైతుల ఫిర్యాదుపై విచారణ నిమిత్తం పొన్నూరు రూరల్ సీఐ, ఎస్ఐ, చేబ్రోలు ఎస్ఐ, సిబ్బంది శుక్రవారం సంగం డెయిరీ వద్దకు వెళ్లారు. అక్కడ పోలీసులను లోపలకు రాకుండా సంగం డెయిరీ ముగ్గురు డైరెక్టర్లు, ఉద్యోగులు, సిబ్బంది అడ్డుకున్నారు. పోలీసులను అడ్డుకోవటంతో పాటు, దౌర్జన్యం చేసి, విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురు డైరెక్టర్లు, సెక్యూరిటీ ఎస్వో, ఉద్యోగులు మొత్తం 17 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.ఆనంద్ తెలిపారు.

కొత్త ఓట్ల నమోదుపై విచారణ చేపట్టాలి

– పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

నెహ్రూనగర్: పశ్చిమ నియోజకవర్గంలో కొత్తగా నమోదైన ఓట్లపై విచారణ జరిపించాలని పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం పశ్చిమ ఈఆర్వో, అదనపు కమిషనర్ కే.లక్ష్మిశివ జ్యోతి కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ రూల్స్ విరుద్ధంగా ఒక బూతులోనే 70 నుంచి 160 పైగా కొత్త ఓట్లను నమోదు చేయబడ్డాయని, పశ్చిమలో మొత్తం 282 పోలింగ్ బూత్‌లు ఉంటే 39 బూత్ ల్లో 3031 ఓట్లు కొత్తగా నమోదయ్యాయని, వాటిని బీఎల్ఓ ల ద్వారా తక్షణమే విచారణ చేయించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, వైసీపీ నేతలు పాల్గొన్నారు.

సంకల్ప యాత్ర విజయవంతానికి చర్యలు

కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: జిల్లాలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను విజయవంతం చేసేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శనివారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి నిర్వహించిన వీడియో సమావేశానికి స్థానిక కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారితో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గుంటూరు శివారులో జరిగిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు సుమారు 5000 ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారన్నారు. జిల్లాలో నాలుగు ప్రాంతాల్లో ఇప్పటికే ఈ కార్యక్రమం ప్రారంభమైందని చెప్పారు. ఈ యాత్ర జరుగుతున్న ప్రదేశాల్లో వ్యవసాయ డ్రోన్ ప్రదర్శనతోపాటు భూసార పరీక్షల వివరాలను ప్రదర్శిస్తున్నామన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నామన్నారు. విజయవంతం చేయడానికి గ్రామ, మండల, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసామని పేర్కొన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ మోహన్ రావు, హౌసింగ్ పీడీ వేణుగోపాలరావు, జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు, పశుసంవర్ధక శాఖ జేడీ జేపీ వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

విగ్రహాల ఆవిష్కరణ చారిత్రాత్మకం

- రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి
- ప్రకాశం పంతులు, నేతన్న విగ్రహాల ఆవిష్కరణ



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: మంగళగిరి– తాడేపల్లి నగరానికి రెండు వైపులా ఐకాన్‌లులా రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు, నేతన్న విగ్రహం మరోవైపు ఆవిష్కరించడం చారిత్రాత్మకమని రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ప్రకాశం బ్యారేజీ వద్ద ప్రకాశం పంతులు విగ్రహంతో పాటు నేతన్న సర్కిల్‌లో నేతన్న విగ్రహాన్ని శనివారం ఆయన ఆవిష్కరించారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, మురుగుడు హనుమంత రావు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ ఆకురాతి రాజేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడం అభినందనీయమని తెలిపారు. చేనేత పరిశ్రమ అభివృద్ధితో పాటు కార్మికులకు ఉపాధి కల్పనలో గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆర్కే గతంలో ఎన్నడూ లేని విధంగా రూ. 4 కోట్లతో వైఎస్సార్, ప్రగడ కోటయ్యల పేరుతో వ్యాపారుల కోసం చేనేత భవనం నిర్మించారన్నారు. రూ 3.50 కోట్లతో కార్మికులకు మగ్గాల షెడ్లు నిర్మించి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేసినట్లు చెప్పారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ మంగళగిరి–తాడేపల్లి నగరానికి వచ్చే వారికి స్వాగతం పలుకుతూ ఇరువైపులా ప్రకాశం పంతులు, నేతన్న విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రూ. 60 లక్షలతో ఎంటీఎంసీ ముఖద్వారాన్ని నేతన్న సర్కిల్‌గా నామకరణం చేసి నేతన్న విగ్రహం ఏర్పాటు చేసినట్లు వివరించారు.

కార్యక్రమంలో రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు గంజి చిరంజీవి, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, దుగ్గిరాల జెడ్పీటీసీ మేకతోటి అరుణ, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ, రూరల్ జేసీఎస్ కన్వీనర్లు ఎండి. ఫిరోజ్, అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి, తాడేపల్లి పట్టణ కన్వీనర్ బుర్రముక్క వేణుగోపాల స్వామి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, బీసీ నాయకుడు కత్తిక మల్లిఖార్జున రావు, సంకె సునీత, దాసరి వీరయ్య, నగర కమిషనర్ నిర్మల్ కుమార్, పద్మశాలీయ సంఘాల నాయకులు జొన్నాదుల వరప్రసాద్, రామనాధం పూర్ణ చంద్రరావు, గంజి రవీంద్రనాథ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీకా రక్షయ

- ఉచిత వ్యాక్సినేషన్‌కు ప్రభుత్వం చర్యలు
- డిసెంబర్ 15 నుంచి కార్యాచరణ
- ఇంటింటి సర్వేలో వైద్యసిబ్బంది



గుంటూరు మెడికల్: వైద్య ఆరోగ్య శాఖ చరిత్రలో కనీవిని ఎరుగని రీతిలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా మరో కొత్త ఆరోగ్య కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. క్షయ వ్యాధి (టీబీ) నియంత్రణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రకటించింది. ప్రస్తుతం 2021 నుంచి చిన్నారులకు టీబీ సోకకుండా ముందస్తుగా ప్రభుత్వం ఉచితంగా బాసిల్లస్ కాల్మెట్ గ్వెరిన్ (బీసీజీ) వ్యాక్సిన్ వేస్తుంది. మరో అడుగు ముందుకు వేసి పెద్దవారికీ టీబీ రాకుండా ముందస్తు వ్యాక్సిన్లు వేసేందుకు రంగం సిద్ధం చేసింది. డిసెంబరు 15 నుంచి జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా టీబీ నియంత్రణ వ్యాక్సిన్లను వేయనున్నారు.

టీబీ లక్షణాలు

రెండు వారాలకు మించి దగ్గు , జ్వరం ఉంటుంది. బరువు తగ్గుతారు. తెమడతోపాటు రక్తం పడుతుంది. ఛాతి ఎక్స్‌రేలో మార్పు కనిపిస్తుంది. ఆకలి తగ్గిపోతుంది.

వ్యాధి వ్యాప్తి

టీబీ ఉన్నవారితో ఎక్కువ సమయం గడిపేవారికి టీబీ సోకే అవకాశం ఉంది. జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వ్యాధి బాధితులు ఉండటం ద్వారా వారు దగ్గినా, తుమ్మినా తుంపర్ల ద్వారా సోకుతుంది. హెచ్ఐవీ బాధితులకు, మధుమేహ వ్యాధి బాధితులకు, ఊపిరితిత్తుల వ్యాధి ఉన్నవారికి, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి టీబీ వ్యాధి త్వరగా సోకుతుంది.

ఉచిత వైద్య సేవలు

జిల్లాలో 2005 నుంచి క్షయ వ్యాధి నియంత్రణ చికిత్సలను ప్రభుత్వం అందిస్తోంది. టీబీ నియంత్రణ కోసం జిల్లావ్యాప్తంగా ఆరు ట్యూబర్ క్యూలోసిస్ (టీబీ) యూనిట్లు, 21 డిజిగ్నేటెడ్ మైక్రోస్కోపి సెంటర్లు పనిచేస్తున్నాయి. సీబీన్యాట్ మిషన్లు ఐదు, ఆర్టీపీసీఆర్ మిషన్లు 12 ఉన్నాయి. వీటి ద్వారా త్వరగా టీబీని నిర్ధారిస్తున్నారు. ఉచితంగా టీబీ పరీక్షలు చేయడంతోపాటు, ప్రభుత్వం ఆరు నెలల నుంచి ఎనిమిది నెలల వరకు టీబీ బాధితులకు ప్రతి నెలా ఉచితంగా మందులు అందిస్తోంది. మందులతోపాటు పౌష్టికాహారం నిమిత్తం రూ.500 లు నేరుగా బాధితుల అకౌంట్‌లో జమ చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది జనవరి నుంచి నవంబరు వరకు 4,881 టీబీ కేసులను కొత్తగా గుర్తించారు. నవంబరు నాటికి మందులు వాడుతున్న వారు 2,242 మంది వ్యాధి నుంచి కోలుకున్నారు.

60ఏళ్లు పైబడిన వృద్ధులకు ప్రాధాన్యం

తాజాగా జిల్లా వ్యాప్తంగా ఉచిత బీసీజీ వ్యాక్సినేషన్‌ను చేపట్టిన ప్రభుత్వం తొలుత 60ఏళ్ల పైబడిన వృద్ధులకు ప్రాధాన్యం ఇవ్వనుంది. తర్వాత టీబీతో బాధపడే వారికి, వారి కుటుంబ సభ్యులకు టీకా ఇవ్వనుంది. కరోనా నిర్ధారణ పరీక్షల తరహాలోనే వీలైనంత ఎక్కువ మందికి టీబీ పరీక్షలు చేసేందుకూ చర్యలు చేపట్టనుంది.

క్షయ రహిత జిల్లానే లక్ష్యం



టీబీ నియంత్రణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పెద్దవారికి ఉచిత బీసీజీ వ్యాక్సినేషన్ చేపట్టనుంది. దీని కోసం గత బుధవారం రాష్ట్ర ఉన్నతాధికారులు జూమ్ కాన్ఫరెన్సు ద్వారా పలు మార్గదర్శకాలు జారీ చేశారు. క్షేత్ర స్థాయిలో ఇంటింటికీ సర్వే చేపట్టి టీకా పంపిణీకి అర్హులైన వారిని ఎంపిక చేసే ప్రక్రియలో ఇప్పటికే వైద్య సిబ్బంది నిమగ్నమయ్యారు. ఇప్పటికే వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పిల్లలకు ఉచితంగా బీసీజీ టీకా వేస్తున్నాం. డిసెంబరు 15 నుంచి జిల్లా వ్యాప్తంగా పెద్దవారికి ఉచిత వ్యాక్సిన్ ప్రక్రియ ప్రారంభమవుతోంది. జిల్లాను టీబీ రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకెళ్తాం.

–డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు
డీఎంహెచ్ఓ

నేడు రజక ఆత్మగౌరవ దీక్ష



మాట్లాడుతున్న అంజిబాబు

ఏఎన్‌యూ: ఆంధ్రప్రదేశ్ రజక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా ఉన్న మైదానంలో ఆదివారం 'రజక ఆత్మ గౌరవ దీక్ష' జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పాతపాటి అంజిబాబు తెలిపారు. దీక్షా ప్రాంగణంలో శనివారం విలేకర్లతో మాట్లాడుతూ పార్టీలకు, సంఘాలకు అతీతంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో రజకులకు దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలని, రజకులను ఎస్సీల జాబితాలో చేర్చాలని, చేనేత, గౌడ, మత్స్యకారులకు ప్రభుత్వం 50 సంవత్సరాలకే ఇస్తున్న పెన్షన్ రజకులకు కూడా ఇవ్వాలని, రజకుల రక్షణకు చట్టాన్ని వెంటనే అమలు చేయాలని, రజక కుల వృత్తి చెరువులపై లీజ్ రద్దు చేసి పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలని, నామినేటెడ్ పోస్టుల్లో రజకులకు అవకాశం కల్పించాలనే డిమాండ్‌తో ఈ దీక్ష నిర్వహిస్తున్నామన్నా రు. కార్యక్రమం ఆదివారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. విలేకర్ల సమావేశంలో ఐక్యవేదిక నాయకులు ఎ.నాగమల్లేశ్వర రావు, జె. లక్ష్మీ ప్రసాద్, పి.సాంబశివరావు, కె శ్రీనివాసరావు పాల్గొన్నారు.